

# అనగనగా ఓ మంచి కథ

## భోగం మనిషి - మునిపల్లె రాజు

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 11-9-63 సౌజన్యంతో

**మొన్న ఉత్తరం వచ్చింది. నిన్న తంతి.** రెండూ బాలకృష్ణ మేనమామ వద్దనుంచే. కక్షతో, ద్వేషంతో, నిస్పృహతో వాటిని చదివి గదిలో మేజాబల్లమీద విసిరివేశాడతను.

తండ్రికి చాలా జబ్బుగా ఉన్నదట. తండ్రికి మాటలు పడిపోయాయట. ఎవరీ తండ్రి? కొడుకు సంగతి ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందా? తనకోసం ఎదురుచూడటమెందుకు? భోగందాన్ని పెట్టుకుని ఏళ్ళు పైబడ్డా సిగ్గులేని కులుకులన్నీ కులికి, తననూ, లక్ష్మీదేవి వంటి తన తల్లినీ ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళూ నిర్లక్ష్యం చేసి, చివరకు వేసంగి సెలవుల్లో రెండు నెలలు ఇంట్లో ఉన్నా, ఒక్కసారి ఒక్కదినం కూడా తనను పలకరించి ఎరగని తండ్రేనా - ఇప్పుడు అవసానంలో తనకోసం ప్రాణాలు గొంతులో, కండ్లలో నిలుపుకుని ఉన్నది? తనెందుకు పోవాలి? తను రాముడా? యుధిష్ఠిరుడా? సత్యవంతుడా? ఏ పురాణ పురుషుడు? తన గుండెలోని గాయాలను ఎవరు మాన్పుతారు? తన తల్లి కన్నీళ్ళ నెవరు తుడుస్తారు? చేసిన వాళ్ళకిక క్షమార్పణ ఏమిటి? తను పాపం చేస్తున్నాడా? ధర్మం, న్యాయం ఆ తండ్రే గదా త్రుంచి వేసింది? ఇప్పుడు తను వెళ్ళి ఆ ధర్మాన్నేమో నిలబెట్టాలా? చీమూ, నెత్తురూ, తన ఆత్మగౌరవం - వీటిమాటేమిటి?

యూనివర్సిటీ హాస్టలు గదిలో మంచం మీద నిద్రలేకుండా దొర్లుతూ, కక్షతోనూ ద్వేషంతోనూ, నిస్పృహతోనూ ఆ రాత్రంతా సంఘర్షణ పడ్డాడు బాలకృష్ణ. తన ఆత్మను ఎవరికి నివేదించుకోగలడు? వీళ్ళకా? మిత్రుల కింద చెలామణి అవుతూన్న ఈ లోతులేని మానవులకా? సినిమాలూ, అందమైన ఆడపిల్లలూ బుర్రంతా ఆక్రమించుకోగా, రాబోయే ఉద్యోగాల చదువుకై ధనం, కాలం వ్యయంచేస్తున్న తన మిత్రబృందమా? ఈ ధర్మాధర్మ విచక్షణకు తోడ్పడేది? కానీ మామయ్య ఉత్తరంలో చివరి వాక్యం మాత్రం వీళ్ళందర్నీ నిజంగా ఆకర్షించి ఉండేది.

'ఆస్తి పరహస్తగతం అయిపోతుంది. మీ నాన్న కళ్ళు మూశాడా, ఆ ముండ - ఇల్లు కొల్లగొట్టుకుపోవటం మాత్రం తథ్యం.' అందుకే తను పోగూడదనుకున్నది. పోనీ, ఈ ఆస్తినంతా తన భోగందానికే ఇచ్చుకోనీ. అన్ని ధర్మాలనూ, న్యాయ నీతిశాస్త్రాలనూ కాలదన్ని, కొడుకునూ, భార్యనూ అవమాన పరంపరలతో కాలరాచిన మహాపురుషుడి ఆస్తికి తను వారసత్వం వహించటమా మగటిమి? వద్దు.

కిటికీ గుండా నీరెండ సోకి, కళ్ళు నొప్పి పుట్టగా అతను అటు తిరిగి, కిటికీవైపు ముఖం పెట్టి మళ్ళీ నిద్రపోవాలని ప్రయత్నించాడు. కానీ బయట వరండానుండి తలుపు బాదుతూన్న వెంకటేశ్వర్లు గొంతు వినిపించి, నిద్రాయత్నమంతా భగ్నమైంది.

"కృష్ణా! కృష్ణా! నీకోసం ఎవరో మనిషి వచ్చాడోయ్."

దోగులాడుతూ లేచి తలుపు తీశాడు. ఎదురుగా మొహతాదు వెంకటాద్రి నిలబడి ఉన్నాడు. ఈ వెంకటాద్రి చిన్నప్పుడు తనను భుజాలమీద మోసినవాడు. రహస్యంగా తాటి ముంజెలూ, తేగలూ, పచ్చి వేరుసెనగపప్పూ, కండెలూ - తను కోరినవన్నీ తెచ్చి ఆప్యాయంగా తినిపించినవాడు. రాత్రింబవళ్ళు తన ఇంటిముందు, ఏనాటి పూర్వజన్మకృతమైన సేవకధర్మంతోనో పడిగాపులు గాచేవాడు.

"ఏం వెంకటాద్రీ? ఎక్కణ్ణించి?"

"ఇంటికాణ్ణించే బాలకిట్టయ్యగారూ"

తనిక మాట్లాడలేదు. గదిలోకి దారితీశాడు. అతని వెనకాలే వెంకటాద్రి లోపలికి వచ్చాడు. చెప్పులు విడుస్తూ అతనే అడిగాడు.

"మామయ్యగోరు తంతి కొట్టాడుగా అందలేదయ్యా?"

"ఏం తంతి?"

"కర్ణంగోరికి శానా బరువుగా ఉందయ్యా. ఇయ్యాల్టికి నాలుగు. మాటలేదు. సూపైతే ఉంది. అట్టా పెద్దవాకిలి కేసి సూస్తా ఉంటాడు రేయిబవులు. గొంతులో అయితే గుడగుడమంటది. పైకి మాత్తరం మాట పెగ్గిలావటం లేదు."

"అయితే నేనెందుకంట రావటం?"

ఆ గ్రామీణుడికి ఈ ప్రశ్న పూర్వాపరాలు తెలిసో, తెలియకో 'చిన్న కర్ణం'గారి వంక తదేక దీక్షగా ఒక్కక్షణం చూశాడు. గదిలో అలిసిపోయిన తన కాళ్ళకు, దేహానికి విశ్రాంతి నిద్దామన్నా కుర్చీలే ఉన్నవి కాని, చిన్న చాప చింకికూడా లేదు. చేతిలో కర్రమీద వంగుతూ అతను మెల్లగా కింద కూర్చున్నాడు.

"బాలకిట్టయ్యగోరూ -"

ఈ బాలకృష్ణయ్య పేరు తన తాతగారి పేరు. పొరబాటున కూడా ఆ పేరు ఉచ్చరించినప్పుడు గౌరవ ప్రబోధం చెయ్యకుండా మాట్లాడి ఎరగడు వెంకటాద్రి.

"నువ్వు రాకపోతే ఇంక నడిచేదెట్టా? ఆ ప్యాణి అట్టా కొట్టుకు మిట్టకలాడ్తంటే."

"అదిగాదు వెంకటాద్రి, నేనొచ్చి చేసేదేముందంట? ఆమె - ఆముందిగా - భోగం ఆవిడ.."

"ఏందండీ! చిన్న కరణంగోరూ! పెద్దయ్యకు భోగం మడిసి తుల్సినీళ్ళు బోసుద్దా - చెట్టంత కొడుకువి నువ్వుంటే?"

"అయితే నేనొచ్చి తులసి నీళ్ళు పొయ్యాలన్నమాట."

"ఎవరుకోసమండీ. ఆయన అబ్బ. నువ్వు బిడ్డవి. కోసేసుకుంటే తెగుద్దా?"

"అసలుంటే గదా కోసేసేది, తీసేసేది?"

"యాడికి బోద్దండీ? ఈ నాలుగు దినాల్నుండి - మీకోసం గాదుంటండీ ప్యాణి నిల్సింది?"

"ఎవరన్నారు?"

"ఎవురో ఏందండీ- నేనంటన్నా."

బాలకృష్ణ అతని తలగుడ్డ చూచాడు. చేతిలో కర్ర చూచాడు. అతని ముఖం చూచాడు. ఏమిటీ విశ్వాసం? ఏమి వేదాంతం? ఏమి నమ్మిక? నవ్వులూ, సంస్కారులూ, ఆత్మగౌరవపరులూ - అనుకునే ఈ విద్యావంతుల కందని ధర్మం, తర్కం, విశ్వాసం, ఈ నిరక్షర కుక్షి, సేవకుడు, వృద్ధుడూ - ఇతనిలో అంతర్వాహినిగా, గత యుగాలనుండీ, తెగిపోని శాశ్వతబంధంగా ఎట్లా నిలిచింది? అతనికి అర్థం కాలేదు. కాకపోవటమేకాదు - తన బింకమూ, ద్వేషమూ, సంఘర్షణా అర్థరహితమై తోచినవి. అతని మాటలు తనలోని లోపాన్ని, తన కుతర్కపు ఆడంబరత్వాన్ని, తను తెంపివేశాననుకున్న గతకాలపు అనుబంధాల బలన్ని, రక్త సంబంధపు పటుశక్తిని, మానవత్వాన్ని ఎత్తి చూపుతున్నట్లుగా తోచినవి.

"చిన్నబాబూ - నేను సతవుకుణ్ణోణ్ణిగాదు. తమకు దెలియందేమీ లేదు. అమ్మగోరు తమర్ని ఉన్న పళాన తోలుకురమ్మన్నారండి."

బాలకృష్ణమూర్తిలో చివర నిలిచిన బలహీనపు బింకం కూడా ఆ మాటలతో కొట్టుకుపోయింది. అసలా మాటలు అందుకే ఉద్దేశించబడినవేమో? గతరాత్రీ, అంతకు ముందు ఉత్తరం వచ్చినప్పుడూ ఆ తర్వాత తంతి వార్తను చదివినప్పుడూ, అమ్మ సంగతే తనకు తోచలేదు. ఈ ఇహలోకపు వ్యాజ్యంలో తనూ, తన తండ్రే కక్షిదారులుగా ఊహించాడు. కానీ ఈ హాస్టలు సహాధ్యాయులూ, ఈ రంగు రంగు దుస్తుల పట్నవాసులూ, లాయర్లూ, లెక్చరర్లూ, రాజకీయ ముఠా నాయకులూ - అనామకుణ్ణిగా కట్టివేసే ఈ పల్లెటూరి పేద ఆసామీ యజమాని తప్పులే తెలియని ఈ పాతకాలపు సేవకుడు అతనికే ఓ ప్రధాన ధర్మాన్ని, పంచాక్షరినుపదేశించిన గురుబ్రహ్మలాగా అమ్మ సంగతి జ్ఞప్తికి తెచ్చాడు.

"వెంకటాద్రీ - నడిచి వచ్చావు. నీగ్గూడా వేన్నీళ్ళు తెప్పిస్తాను. మనిద్దరం ఇప్పుడే బయలుదేరుదాం" అన్నాడు చివరకు.

పాత యుద్ధం నాటి చెవర్లెట్ టాక్సీ - ఇంటిముందుకు వచ్చి ఆగేటప్పటికి చాలామంది జనం కనిపించారు బాలకృష్ణ మూర్తికి. ఊళ్ళో మోతుబరి రైతులు కొందరూ, కోమట్లూ, విశ్వబ్రాహ్మణులూ, తంబలాయన భద్రయ్య - ఆయన మామగారు వైద్యుడు - త్రయంబకం, వెట్టివాళ్ళూ. అందరినీ తోసుకుని, మామయ్యా, బాబాయీ, ఆ ఊళ్ళో నాన్నగారికి వ్యతిరేకంగా ప్రైవేటు చేసే చీరాల పంతులూ - ఎదురుగా వచ్చి చుట్టవేశారు.

ఆ ముగ్గురూ ఒకేసారి మాట్లాడారు. మొదట్లో ఏమీ చెబుతున్నదీ అతనికి వినిపించలేదు. వినిపించినా అర్థం కాలేదు. తను తండ్రి గొంతులో రాగి కాని డబ్బు తడిపిన తులసితీర్థం ఎట్లా పొయ్యాలో వాళ్ళు చెప్పటం లేదు. మడిగట్టుకోవాలో, ఆ గుడ్డలే పనికివస్తయ్యో వాళ్ళు చెప్పటంలేదు. అందరూ ఆస్తి గురించే మాట్లాడుతున్నారు. "పో! నన్ను అన్యాయం చేస్తావా? అని అడుగు. వీలునామా వ్రాస్తావా? వ్రాశావా? ఎక్కడుంది అనడుగు. మీ నాయనమ్మవి గట్టి నానుతాడు, రాళ్ళ పెద్ద వడ్డాణం, కాసులదండా ఏవి అనడగరా. పూర్వీకుల ఆస్తి. మళ్ళీ ఆ లోకంలో కూడా జవాబు చెప్పాల్సి వస్తుందనరా. మొండి ఘటంలే. అన్నింటికీ తట్టుకుంటాళ్ళే. ఇదుగో నీ చేతిమీదిగా పెళ్ళి కావాల్సినవాణ్ణి. ఆ అదృష్టం నాకు లేదు - అనటం మరిచిపోకు సుమా. ఒరేయ్! బాలా! ముందే ఆ మాట అనరా. కాయితం మాట బైటికి రానియ్యటం లేదు సుమా! ఘట్టిపిండం. ఆ సంగతి తేల్చుకో ముందు."

వీళ్ళ మాటలు చెవికి సోకగానే, వెంకటాద్రి నుంచి వచ్చిన పెద్దలమీది భక్తంతా బాలకృష్ణమూర్తికి అయోమయంగా తోచింది. ఏమిటి? అంతా ఆస్తేనా? ఇంకేమీ లేదా జీవి ఇహలోకాన్ని వదిలిపోయే సమయంలో? చేసిన తప్పులు? క్షమార్పణలు? వీడ్కోళ్ళు? ఆదరింపులు? మరిచిపోవటాలు? ఏమీ లేవా? ఇందుకేనా తనను పిలిపించింది వీళ్ళు? అమ్మమాట ఒక్కరూ చెప్పరేం? ఏమిటీ గందరగోళమంతా?

చీరాల పంతులు అంటున్నాడు - "పిచ్చికుక్కను రాళ్ళగొట్టి తరిమినట్లు, తరిమించనూ దాన్ని? ఎవడబ్బ సొమ్మని ఈ పాతికేళ్ళూ పడితిన్నదో - లం..ముండ! భోగం పక్షి."

బాలకృష్ణకు మరీ మతిపోయింది. "వెంకటాద్రీ, అమ్మెక్కడ? అమ్మేదీ?" అని అడుగుతున్నాడు.

వాళ్ళు - బంధువులూ, పెద్దమనుషులూ - అతన్ని వెంకటాద్రికోసం వెతకనియ్యకుండానే, మేడమీదికి రెక్కపుచ్చుకు లాక్కుపొయ్యారు.

●●●

నాన్న మంచం చుట్టూ చాలామంది ఉన్నారు. దూరపువాళ్ళూ, దగ్గరవాళ్ళూ - చుట్టాలే ఎక్కువమంది. అందులో తమతో చాలా సంవత్సరాలుగా మాటలు నిలిపివేసిన, వేలిడిచిన మేనత్త మాణిక్యమ్మకూడా ఉంది. ఒక కుర్చీ మీద మునసబుగారూ, ఇంకో బల్లమీద

సిద్ధాంతి సుబ్బరామయ్య. శివార్చకుల కుర్రాడు చంద్రశేఖరం కల్వంలో మందు నూరుతున్నాడు. బహుశ ఆయనికిక మాడు గీచి పట్టు వేస్తారేమో.

మేడమీది ఆ హాలు చాలా పెద్దది. బిక్కు బిక్కుగా అదంతా కలియజూశాడు. అమ్మ నాన్న కాళ్ళవద్దే ఉన్నది. తన్ను చూసి బావురుమంటే, మాణిక్యమ్మ వచ్చి నోరు మూసి, సర్ది కూచోపెట్టింది. అతను ఎవరి కోసమో ఇంకా కలియజూసాడు. అదిగో! ఆ మూలగా, ఈ జనం, ఈ కుటుంబీకులు తనను వెలివేసినట్లుగానో, తనే వాళ్ళను వెలివేసినట్లు గానో - ఆ మనిషి, ఆ మనిషి - భోగం ఆవిడ - తన తండ్రితో గత పాతికేళ్ళుగా గడిపి, సంసారంలో తల్లి హక్కు కాజేసిన "భోగంది" కూర్చుని ఉన్నది.

మునసబుగారు అతని చెయ్యిపట్టుకుని, నెమ్మదిగా మంచం వైపు నడిపించుకుపోయాడు. నాన్న ఠీవి ఏమీ తగ్గలేదు. పెద్ద పరుపు. తెల్ల బాలీసులు. తెల్ల దుప్పట్లు. ఆయన కండ్లు మాత్రం నీరు కమ్మి ఉన్నవి. ఆయన పొట్టకానుతూ, బాలకృష్ణమూర్తి వీపు వేపు కుడిచేయి వేసి కూర్చున్నాడు. ఇందాకటినుంచీ విశ్వప్రయత్నంతో ఆపి పట్టిన కన్నీళ్ళు చెలియల కట్ట తెగిన సముద్రజలం వలె, బయటి కురికినవి.

పెద్ద కరణంగారి చెయ్యి ఈషణ్మాత్రంగా కదిలింది. బాలకృష్ణ తన చేతిని తండ్రి కందించాడు. ఆయన కళ్ళు మాత్రమే మాట్లాడుతున్నవి. గొంతులో ఉండచుట్టి మాట పెగిలి రావటం లేదు. దుప్పటి కిందికి కొడుకు చేతిని లాక్కున్నాడు సూచనగా. మునసబుగారి వంక చూశాడు - ఒక్క క్షణం తృప్తితో. తన చేతిలో ఏమిటో చిన్న వస్తువు ఉంచాడు. చల్లగా, నల్లగా తగిలిన చిన్న తాళపు చెవి అది.

మామయ్య "అడగరా, అడగరా!" అంటున్నాడు. చీరాల పంతులు "తాళం చెవులు. తాళం చెవులు" అని జ్ఞప్తి చేస్తున్నాడు. నాన్న వంక చూశాడు. చుట్టూ పెద్ద హాహారావం బయలుదేరింది. బంధువులు ఘొల్లుమన్నారు. అమ్మ నాన్నమీదపడి పెద్ద శోకం పెట్టింది.

కానీ మామయ్య మాత్రం - "ఇచ్చాడూ తాళం చెవి? ఏ పెట్టెలో పెట్టేడో ఏమో? ఇంకెక్కడికి పోతుందిలే. ఒరేయ్ వెట్టీలూ -"

బాలకృష్ణ మెల్లిగా లేచి కిటికీ వద్దకు వచ్చి కిందకి చూశాడు. బయట మామయ్య పెట్టిన బందోబస్తు అంతా కనిపించింది. కర్రలతో వెట్టిలూ, ఆ ఊళ్ళో రౌడీలు ముగ్గురూ - యాకోబు, సింగుగాడూ, ఇంకో దూదేకుల సాయెబూ - వీళ్ళంతా నాన్న ఆస్తిని, తన ఆస్తిని, ఆ "మనిషి" బయటికి దాటించకుండా కాపలా అన్నమాట. ఆమె వంక చూశాడు బాలకృష్ణ. గోడ కానుకుని కూచుని ఇందాక చూసిన - మనిషి - ఇప్పుడు కిందకొరిగి ఉన్నది. ముక్కువద్ద వేలుంచి చూశాడు. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆగి ఎన్నడో అయినట్లు తోచినది.

"మునసబుగారూ. వెంకటాద్రీ - ఈమె - ఈమె - చచ్చిపోయింది -" అని గావుకేక పెట్టాడు. ఎందుకో, ఆమె పేరు యశోద అని అతనికి హఠాత్తుగా జ్ఞప్తికి వచ్చింది.

●●●

కానీ "భోగం మనిషి" యశోద చచ్చిపోలేదు. స్పృహతప్పి పడిపోయింది.

చీరాల పంతులూ, మామయ్యా అతన్ని చుట్టుముట్టి, "ఒరేయ్, అది దొంగెత్తు వేసింది. ఇనప్పెట్టెవి, బీరువావి తాళం చెవులు దాచేసింది. అవి వెతకరా" అని సతాయింపు మొదలుపెట్టారు. ఒక శవమూ, ఒక జీవనస్మరణ సమస్యా, అందరూ వెలివేసిన ఒక వేశ్య, ఇద్దరు లౌకిక పరిజ్ఞానులు. బాలకృష్ణలోని అన్నేళ్ళ ద్వేషమూ, కోపమూ, భయంకరానుమానమూ ఈ దృశ్యం ముందు కరిగి మాయమైపోయినవి. అతని ఎదనంతా అనూహ్యమైన మానవత, కరుణ నింపివేసినవి. ధనమూ, బంధనాలూ, దురాగ్రహమూ, అభిమానమూ అర్థంలేని వ్యసనాలుగా తోచినవి. నీళ్ళతో నిండిన కళ్ళనును వాళ్ళవేపుకు తిప్పి - "మీరు చూడటంలా? అక్కర్లేదు. నాకు తాళం చెవులు అక్కర్లేదు. వెంకటాద్రీ, వైద్యుణ్ణి పిలుచుకురా" అని నిరామయంగా పలికాడు.

●●●

సాయంత్రానికి ప్రారంభమైన తండ్రి దహన కార్యక్రమాలు, రాత్రి పొద్దుబోయిగాని ముగియలేదు. ఇంటికి వచ్చినా, అతనెవ్వరితోనూ మాట్లాడలేదు. చచ్చినాయన తలగడ క్రిందనే దొరికిన తాళం చెవుల గుత్తులు మామయ్యను పూర్తిగా తృప్తి పరిచినవి. ఆయన బెడద అంతటితో ఆగిపోయింది. చివరకు, అమ్మను ఓదార్చటానికి కూడా అతడు పోలేదు. నాన్న ఇచ్చిన చిన్న తాళం చెవి రహస్యం అతన్ని వేధించుకు తినసాగింది. రాత్రంతా యశోద మంచం పక్కనే అతను కూచున్నాడు.

తెల్లవారు ఝామున ఆమెకు స్మృతి వచ్చింది.

"కృష్ణబాబూ! మంచినీళ్ళు.." అన్నది.

●●●

నాన్న ఇచ్చిన తాళం చెవి ఆయన సందుకాయ పెట్టిది. అది యశోద వీణ పక్కన దొరికింది. అందులో ఆయన కాయితాలేవో ఉన్నవి. కృష్ణ వాటిన్నిటినీ కలియజూశాడు. కొన్నైతే లెక్కలు. కొన్ని పాత ఉత్తరాలు. వాటిపైన తనకు చివరి రోజుల్లో తండ్రి రాసిన ఉత్తరం దొరికింది. వీలునామా ఉందేమోననుకున్నాడు - కాదు. ఆ ఉత్తరమే వీలునామా.

"నాన్నా! బాలకృష్ణా! నాకు గతి పదిరోజుల్నుండీ ఇక బ్రతకననే అనుమానం వేధించుకు తింటున్నది. మన దురభిమానాలు వదిలేద్దాం. ఈ ఉత్తరం నీతో నా చివరి మాటలు చెప్పటానికి. విను - మీ అమ్మను నేనెన్నడూ బాధించలేదు. రాచి రంపాన పెట్టలేదు. దానిది ఒక తత్వం. మొండితనం, మంకుపట్టు. నాకవి పడనిమాట నిజమే. యశోద ఈ ఇంటికి రాకపూర్వమే దాని తత్వం అట్లా ఉండేది. యశోద కులానికి మాత్రమే వేశ్య. ఒక సందర్భంలో ఆమెను రక్షించవలసిన బాధ్యత నా పైన పడ్డది. మన పూర్వీకుల సంగతి నీకు కర్ణకర్ణిగానైనా తెలిసి ఉండవచ్చు. మన ఇంటికి తెచ్చాను. మగవాడి రక్షణలేని స్త్రీ గతి ఈ దేశంలో అధోగతే గదా! ఆమె వచ్చినప్పట్నించీ మీ అమ్మ పోరు ఎక్కువైంది. అది సహజం అని ఊరుకున్నాను. మీ మామయ్య వచ్చి ఆస్తి పంపకాలు, హక్కులూ ప్రారంభించాడు. నాకు చిర్రెత్తి ఆస్తంతా యశోద పేర వ్రాశాను ఒకసారి. ఆ కాగితాన్ని ఆమే చించేసింది. ఏడుపుపొక్కటే మీ అమ్మకు తెలుసు. కానీ యశోదకు - నీ భవిష్యత్తు తెలుసు. నేను తాత్సారించినా నీకు డబ్బూ, దుస్తులూ పుష్కలంగా పంపించే ఏర్పాటు చేసేది. నీకు భార్యవస్తే, వీణ నేర్పాలని ఎంతో కుతూహలపడేది. కానీ ఈ కులస్త్రీగాని మనిషిని ఎవరు గుర్తిస్తారు? కొంత ఆస్తి వ్రాస్తానన్నాను. వద్దన్నది. నాతోనే చచ్చిపోతానన్నది. నీతో ఒక్క మాట కోసం - ఇన్నేళ్ళూ పడి చచ్చింది. నువ్వూ, అమ్మా ఆ అవకాశం దానికివ్వలేదు. 'ఆస్తి ఎందుకు వద్దన్నావు - నేను పోతే ఎట్లా?' అనడిగాను. నువ్వున్నావన్నది. చిన్నతనంలో నువ్వెత్తుకుని ఆడించినవాడిని కాదన్నాను. నాకేమీ అక్కరలేదన్నది. ఆ నమ్మకాన్ని నేనెందుకు చెడగొట్టాలి?

మీ మామయ్యకు చెప్పు. నేను ఆస్తినేమీ పాడుచెయ్యలేదని. మీ అమ్మకు చెప్పు - ఇది మన పూర్వజన్మ సుకృతమని.

నీకు తెలుసునో, తెలీదో - యశోద రాత్రిళ్ళు ఆవుపాలు మాత్రం త్రాగుతుంది. సంగీతంకోసం వచ్చిన అలవాటది. యశోదను కూడా నువ్వు మనిషిగా చూస్తే, నేనామెను ఇక్కడికి ఏ పరిస్థితుల్లో తెచ్చానో, ఆ కర్తవ్యం పూర్తవుతుంది. నా ఆస్థికలు కాశీలో కలిపినంత పుణ్యం అదే నాకు"

●●●

బాలకృష్ణ గబగబా యశోద గదికి పరిగెత్తాడు. తనకోసమే నిరీక్షిస్తున్నట్లుగా ఆమె కన్నులు చెబుతున్నవి.

"అమ్మా - కృష్ణుణ్ణి దేవకి కన్నది. కానీ యశోద పెంచింది. నా గోవుపాలన్నీ నీకిస్తాను. మా నాన్నగారు గొప్ప మనిషి. ఆయన కొడుకునని అనిపించుకుంటాను" అన్నాడు.

●●●

Click here to share your comments on this story.